జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 10 | మార్చి | 2026 ◆ పేజీలు : 9

## భద్రాద్రి రామయ్యకు రూ.1.05 కోట్ల హుండీ ఆదాయం

- 39 రోజుల్లోనే కోటి దాటిన ఆదాయం



**భద్రాచలం, మార్చి 9, ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి రూ. 1,05,94,090 హుండీ ఆదాయం లభించింది. రామాలయంలోని చిత్ర కూట మండపంలో సోమవారం ఆలయ హుండీలను తెరిచి లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో కె. దామోదర్ రావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపులో రూ.1,05,93,090 నగదు లభించగా, 80 గ్రాముల బంగారం, 650 గ్రాముల వెండి కూడా లభించాయి. అదేవిధంగా విదేశీ కరెన్సీ రూపంలో 91 యూఎస్ డాలర్లు, 5,000 వియత్నాం డాంగ్, 110 న్యూజిలాండ్ డాలర్లు, ఐదు యుఏఈ దిర్హామ్స్, ఐదు మాల్దీవ్స్ రూపాయలు,

మిగతా 2 లో...





### సమన్వయంతోనే...

# సమగ్ర అభివృద్ధి సాధ్యం

## ఎల్ బీఎస్ ఎన్ ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరణికాంతి

**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి 9 ప్రజాజ్యోతి:** జిల్లాలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్ బీఎస్ ఎన్ ఏఏ) డైరెక్టర్ శ్రీరామ్ తరణికాంతి అన్నారు, సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనను ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు, జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారుల నుండి సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా మొత్తం జనాభా, జననాల రేటు, ప్రజల సగటు జీవన కాలం, వ్యవసాయ భూముల విస్తీర్ణం, రహదారుల పొడవు, అటవీ ప్రాంతాల శాతం, సాగునీటి వనరులు, అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య, డీఆర్ డీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి సమాచారం సేకరించారు. ప్రతి ప్రభుత్వ అధికారి తన బాధ్యతల నిర్వహణలో నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. అధికారులు తమ శాఖల పనితీరుకు మాత్రమే పరిమితం కాకుండా ఇతర శాఖల కార్యక్రమాలపై కూడా అవగాహన

మిగతా 2 లో...

## అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు

- రూ. కోటితో అంతర్గత రహదారులకు శంకుస్థాపన



**ఇల్లందు, మార్చి 9, ప్రజాజ్యోతి:** అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు గ్రామాలలో రూ.కోటి వ్యయంతో అంతర్గత రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం రొంపేడు సెంటర్ లో మహిళలకు తడి, పొడి చెత్త బుట్టలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

మిగతా 2 లో...

## మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ కలకలం

- నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురి... ఆసుపత్రిలో చికిత్స

2 లో...

### గోదావరి ఘాట్ లో...

## పారిశుద్ధ్య కార్యక్రమం

- పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం: శ్రీరామ్ తరణి



**భద్రాచలం, మార్చి 9,ప్రజాజ్యోతి :** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం మరియు పరిశుభ్రత పట్ల పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యం అయితే భద్రాచలం పట్టణం ఎల్లప్పుడూ సర్వసుందరంగా కళకళలాడుతుందని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలనా అకాడమీ

మిగతా 2 లో...

## స్మార్ట్ ఫోన్ ల మాయలో సమాజం

- పిల్లల నుంచి పెద్దల వరకు పెరుగుతున్న వినియోగం
- మానసిక ఆరోగ్య సమస్యలకు దారి
- సమయ నియంత్రణ అవసరమంటున్న నిపుణులు



6 లో..

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది రోజువారీ అవసరాల కోసం స్మార్ట్ ఫోన్ లపై ఆధారపడుతున్నారు. అయితే వీటి వినియోగం పరిమితి దాటితే మానసిక, శారీరక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు





(మొదటి పేజీ తరువాయి... )

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో పని చేస్తుందని స్పష్టం చేశారు. గత పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఇచ్చినప్పటికీ పేదలందరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గ్రామ ఆభివృద్ధి మనందరి భాధ్యత అని, గ్రామంలో ఉన్న సమస్యలు మనందరం కలిసి కట్టుగా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా మన గ్రామంలో ఉన్న సమస్యలు అధికారులు మనం అందరం కలిసి షరిష్కారం దిశగా ప్రయాణం చేద్దామన్నారు. అనంతరం రొంపేడు ప్రాథమిక ఆసుపత్రి సెంటర్ ను సందర్శించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ఏఈ తో ఫోన్లో మాట్లాడి వైద్యశాలలో షార్ట్ సర్క్యూట్ సమస్యను పరిష్కరించాలని, 33 కెవి లైన్ తక్షణమే తొలగించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, తిలక్ నగర్, మామిడి గుండాల, కొమ్ముగూడెం సర్పంచులు దనసరి స్రవంతి రాజు, ఈసం బాలకృష్ణ, తాటి యశోద రాంబాబు, నాయకులు పూనెం సురేందర్, ఎట్టి హరికృష్ణ, కునుసోత్ రాము, దండగల శివ, యంపిడిఓ దన్ సింగ్, హౌసింగ్ ఏఈ, స్వాతి ఆర్ అండ్ బి ఏఈ రాజు, డిఈ రామకృష్ణ, డాక్టర్ కవిత, వ్యవసాయ శాఖ ఏఓ సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు రూ.1.05 కోట్ల హుండీ ఆదాయం



(మొదటి పేజీ తరువాయి... )

ఐదు కెనడా డాలర్లు లభించాయి. కాగా హుండీ లెక్కింపును చివరిసారిగా జనవరి 29న నిర్వహించగా, అనంతరం మళ్లీ సోమవారం నిర్వహించారు. జనవరి 29 తరువాత ఎటువంటి ప్రత్యేక ఉత్సవాలు, ఎక్కువ సెలవు దినాలు లేకపోయినప్పటికీ రామాలయానికి గణనీయంగా హుండీ ఆదాయం పెరగడం విశేషంగా నిలిచింది. కేవలం 39 రోజుల్లోనే రూ.కోటి మార్కును దాటడం పట్ల దేవస్థానం వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి

# సమన్వయంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం





(మొదటి పేజీ తరువాయి... )

కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి శాఖకు మరో శాఖతో అనుబంధం ఉండే పరిస్థితి ఉంటుందని, అన్ని శాఖల సమన్వయంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు .ఈ నేపథ్యంలో ప్రతి శాఖ అధికారి ఇతర శాఖలకు సంబంధించిన కనీసం ఐదు ముఖ్య అంశాలను నమోదు చేసుకోవాలని, అలాగే ఇతర శాఖల అభివృద్ధికి దోహదపడే రెండు సూచనలను కూడా నమోదు చేసి వాటి అమలుకు కృషి చేయాలని సూచించారు. ఈ విధంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తే రాబోయే ఏడాది కాలంలో జిల్లా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.అధికారులు తమ సేవలోకి రాకముందు సాధారణ పౌరులుగా ఎదుర్కొన్న సమస్యలను గుర్తుచేసుకుని, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రతి అధికారి తన విధి నిర్వహణలో 70 శాతం సమయాన్ని కార్యాలయ పనులకు కేటాయిస్తూ, మిగిలిన 30 శాతం సమయాన్ని అభివృద్ధి కార్యక్రమాలపై ఆలోచించేందుకు వినియోగించాలని తెలిపారు.జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని, తడి చెత్త – పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక ప్రజా మరుగు దొడ్డి ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

అలాగే రవా ణా శాఖ పరిధిలో వాహనాలకు తగిన పార్కింగ్ సదుపాయాలు ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన ఇంటిని ఎలా శుభ్రంగా, సక్రమంగా నిర్వహిస్తాడో అదే విధంగా ప్రభుత్వ భవనాల నిర్వహణపై కూడా శ్రద్ధ చూపాలని సూచించారు. దీంతో భవనాల మరమ్మతుల ఖర్చులు తగ్గడంతో పాటు వాటి ఆయుష్షు పెరుగుతుందని తెలిపారు. జిల్లా జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ జనగణన లెక్కల ప్రకారం విద్యార్థులు, చిన్నపిల్లలు, కార్మికులు ఎంత శాతం ఉన్నారో పరిశీలించాలని, మిగిలిన వారు ఎక్కడ ఉన్నారు, వారు ఏం చేస్తున్నారు అన్న విషయాలను గుర్తించి వారిని అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామ్యం చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో ఉన్న వ్యవసాయ భూములకు అనుగుణంగా చెరువులు, కాలువలు, ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట కొత్త నీటి వనరుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి జిల్లా అధికారిని ఒక మండలానికి నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఆయా మండలాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా ఈ అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.

పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధి, మౌలిక వసతులు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి పలు రంగాల్లో కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ శ్రీరామ్ తరణికాంతి, ఐఏఎస్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ కలకలం

- నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురి... ఆసుపత్రిలో చికిత్స





**మణుగూరు క్రైమ్ , మార్చి 09,ప్రజాజ్యోతి :** మణుగూరు పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన కలకలం రేపింది. పాఠశాలలో భోజనం చేసిన అనంతరం నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. విద్యార్థులకు అకస్మాత్తుగా వాంతులు, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపించడంతో పాఠశాల సిబ్బంది వెంటనే స్పందించి వారిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యులు విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## గోదావరి ఘాట్ లో పారిశుద్ధ్య కార్యక్రమం



(మొదటి పేజీ తరువాయి... )

డైరెక్టర్ శ్రీరామ్ తరణి పేర్కొన్నారు.సోమవారం భద్రాచలంలోని గోదావరి ఘాట్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న భద్రాచలానికి దేశ విదేశాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించిన తర్వాత స్వామివారి దర్శనానికి వెళుతుండటంతో గోదావరి తీర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.గోదావరి కరకట్ట ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు చెత్త పేరుకుపోకుండా గ్రామపంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలానికి వచ్చే భక్తులు మరియు పర్యాటకులకు మంచి అభిప్రాయం కలిగేలా పట్టణం, గోదావరి తీర ప్రాంతాలు మరియు దేవస్థానం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.అనంతరం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్ మృణాలి శ్రేష్ఠ, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూనెం కృష్ణదొర, గ్రామపంచాయతీ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అథ్లెటిక్స్‌లో రాణించాలి

- **డిప్యూటీ మేయర్ సిరి పురం లలిత కుమారి**





**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి 9: ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలోని స్థానిక శ్రీనివాస్ కాలనీ లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి రిలే కార్నివాల్ అథ్లెటిక్స్ ఎంపికల పోటీలు సోమవారం ఘనంగా నిర్వహించారు , ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత కుమారి హాజరై ఒలింపిక్ జెండాను ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడు తూ అథ్లెటిక్స్‌లో పురుషులతో పాటు మహిళలు కూడా చురుకుగా పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుండి సుమారు వందమంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఎండను కూడా లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం అభినందనీయం అని అన్నారు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇటీవల రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో సీఎం కప్ సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచిందని గుర్తుచేసిన ఆమె, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా పేరును దేశవ్యాప్తంగా నిలబెట్టాలని క్రీడాకారులకు సూచించారు.అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్ మాట్లాడుతూ, ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 15వ తేదీన హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ఆధ్వర్యంలో పీటీలు ఎర్రయ్య, శ్వేతాలు నిర్వహించినట్లు తెలిపారు.

## కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- **నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయ, ఉద్యోగుల నిరసన**

**బూర్గంపహాడ్, మార్చి 9 (ప్రజా జ్యోతి):**కేజీబీవీలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బూర్గంపహాడ్ మండలంలోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. రెండు దశాబ్ధాలుగా విద్యావ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు, ఉద్యోగులు నేటికీ అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వేతనం కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లను ప్రిన్సిపాల్ గా, పీజీసీఆర్టీలను జూనియర్ లెక్చరర్లు, సీఆర్టీ, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పరిగణించి కనీస మూలవేతనాలు చెల్లించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో 29 రోజుల పాటు సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిలిపివేసిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ప్రతి కేజీబీవీ పాఠశాలలో కేర్ టేకర్లు, నైట్ వాచ్మెన్లను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. 16న జిల్లా కేంద్రంలో జరిగే భారీ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయ, ఉద్యోగులు, సిబ్బంది పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల అధ్యక్షులు బి.బాలు, సహ అధ్యక్షులు టి.రమేష్, మండల సహాయ కార్యదర్శి జనార్ధన్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల, సిబ్బంది పరమేశ్వరి, దివ్య, చంద్రిక, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆందోళన

- **కేజీబీవీ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన**



**భద్రాచలం,మార్చి 9,ప్రజా జ్యోతి** స్థానిక కేజీబీవీ పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నదని ఆరోపిస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్ కుమార్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇప్పటికీ అరకొర వేతనాలతోనే పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్లను ప్రిన్సిపాల్స్‌గా, పీజీసీఆర్టీలను జూనియర్ లెక్చరర్లుగా, సీఆర్టీ, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పరిగణించి కనీస మూల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే గత ప్రభుత్వం హయాంలో 29 రోజుల పాటు సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికీ నిలిపివేసిన వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు వర్తింపజేయాలని, ప్రతి కేజీబీవీ పాఠశాలలో కేర్‌టేకర్లు, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 16న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో పాఠశాల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ భద్రాచలం మండల అధ్యక్షుడు కొమరం శ్రీనివాస్, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వర్లు, భద్రాచలం మండల ఉపాధ్యక్షుడు కే.ఎం. కరుణకుమార్, ఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూ ఎఫ్ మండల కన్వీనర్ కే. సైదులు, మండల కార్యదర్శి కె. నాగలక్ష్మి , పూర్ణ తదితరులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన ఇంటర్మీడియట్ పరీక్షలు

- **జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు**

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి9: ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం నిర్వహించిన ఫిజిక్స్ పేపర్–1, ఎకనామిక్స్ పేపర్–1 పరీక్షలకు జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ పరీక్షలకు జనరల్, వొకేషనల్ విభాగాలకు కలిపి మొత్తం 9,964 మంది విద్యార్థులు కేటాయించబడగా, అందులో 9,105 మంది విద్యార్థులు హాజరయ్యారనీ తెలిపారు, 859 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు అని , పరీక్షల సమయంలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు, తదుపరి రోజు పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తిచేసినట్లు తెలిపారు.

## కొత్త గనులను సింగరేణికి కేటాయించాలి

- **కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తాం**
- **స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో ఒప్పుకున్న డిమాండ్ లను అమలు చేయాలి**
- **ఏ.సి.బి కేసు తో సంబంధం లేకుండా మెడికల్ బోర్డు ను వెంటనే నిర్వహించాలి**
- **పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ యాజమాన్యమే చెల్లించాలి...**
- **విలేకరుల సమావేశంలో ఏఐటియుసి నేత మిరియాల రంగయ్య వెల్లడి.**




**కొత్తగూడెం సింగరేణి, మార్చి 9 – ప్రజాజ్యోతి:**కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి కొత్త గనులు ఇవ్వకుండా తెలంగాణ లో ఉన్న సింగరేణి సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని, వేలం తో సంబంధం లేకుండా తెలంగాణ లో ఉన్న కొత్త గనులు సింగరేణి కి కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తామని సోమవారం కొత్తగూడెం శేషగిరిభవన్ లో జరిగిన ఏఐటియుసి మీడియా సమావేశంలో వెల్లడించారు. సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటియుసి తో నవంబర్ 2024 , మార్చి 2025 లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో పలు డిమాండ్ లను అంగీకరించి అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. ముఖ్యంగా స్వంత ఇంటి పథకాన్ని, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ చెల్లింపు లపై సర్క్యులర్ లను జారీ చేయకుండా కార్మికుల ను మోసం చేస్తుందని వారు ఆరోపించారు. మెడికల్ బోర్డు ను ఏ.సి.బి విచారణ పేరుతో నిలిపి వేశారని వారు ఆరోపించారు. అనారోగ్యం వల్ల కార్మికులు చాలా మంది మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు కు పిలువ కుండా కాలయాపన చేస్తూ కార్మికుల ను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వారికి ఉద్యోగాలు రావడం లేదని వారు ఆరోపించారు. జనరల్ సమ్మె లో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల నుంచి జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దానిని వెంటనే రద్దు చేసి రికవరీ చేయొద్దని వారు డిమాండ్ చేశారు. సింగరేణి లో మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్ మెన్ ల సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, లేకుంటే సమ్మె కు పిలుపునిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ , కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు, సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, ఎరగని కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, సందబోయిన శ్రీనివాస్, హుమాయూన్, జాన్ నరసయ్య, మండల రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, తిరుపతి, సోమయ్యా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**బూర్గంపహాడ్, మార్చి 9 (ప్రజా జ్యోతి):**మండల కేంద్రమైన బూర్గంపహాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, పినపాక పట్టీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు 108 మందికి మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాగంటి వెంకటేశ్వరరావు సోమవారం పరీక్షల సమయం కావడంతో పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందజేశారు.విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసిపాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో యదుసింహరాజు,బూర్గంపహాడ్ సర్పంచ్,ఉపసర్పంచ్లు మందా నాగరాజు, గుండె వెంకన్న, సీనియర్ పాత్రికేయులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.



## కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టిఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్



**చర్ల, మార్చ్ 09: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చర్ల కేజిబివిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. మురళీమోహన్ మాట్లాడుతూ . రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మొదటి దశ కార్యక్రమంగా 09 న కేజీబీవీల్లో ఈ నెల 16 న జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.కేజీబీవీ లలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమ్మె చేసిన కాలానికి జీతం చెల్లించాలి అని , ఉద్యోగ భద్రత కల్పించాలని,హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, ఎస్ ఓ లను ప్రిన్సిపాల్,పీ జి సి ఆర్ టి లను జె ఎల్ గా సి ఆర్ టి లను ఎస్ ఏ లుగా గుర్తిస్తూ మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వి బాలకృష్ణ,అధ్యక్షులు కాక రాంబాబు, సహాధ్యక్షులు పి రాధ, హిమగిరి బాబు,కేజీబీవీ,ఎస్ ఓ ,సి ఆర్ టి , బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## యస్ అండ్ పిసి సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణా తరగతులు ప్రారంభం



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 9 – ప్రజాజ్యోతి:** స్థానిక యస్&పి.సి. ట్రైనింగ్ సెంటర్ లో సోమవారం నుండి 33 మంది సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజులపాటు జరుగు 40వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులను ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం. డి జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్&పి.సి. విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్ లోని అన్ని అంశాలపై బోధించడం జరుగుతుందని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరుగుతుందని, మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని, మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించాలని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు.

## శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక రుద్రాభిషేకం

- సోమవారాన్ని పురస్కరించుకొని పూజలు, అన్నదాన కార్యక్రమం







**అన్నపురెడ్డిపల్లి, మార్చి 9,ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారాన్ని పురస్కరించుకొని మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. హెచ్ ఈ ఎస్ కంపెనీ ప్రతినిధులు, యాదాల జమలయ్య–శ్రావణి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ తన తండ్రి స్మారకార్థంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి స్థానిక ఉపసర్పంచ్ మారగాని అశోక్, స్థానిక ఎస్సై విజయసింహారెడ్డి, గ్రామ పెద్దలు హాజరయ్యారు. అలాగే ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, దోసపాటి రాంబాబు, యదాల వెంకన్న, చల్లా రమేష్ తదితరులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. స్కూల్ సిబ్బంది, గ్రామ భక్తులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. ఆలయంలో జరిగిన అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి.

## బెల్టుషాపుల దందాను అరికట్టాలని గ్రీవెన్స్లో ఫిర్యాదు



**బూర్గంపహాడ్, మార్చి 9 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో బెల్టుషాపుల్లో విచ్చలవిడి మద్యం దందాను అరికట్టాలని బీజేపీ నాయకులు సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్లో జరిగిన గ్రీవెన్స్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలో బెల్టుషాపుల్లో ఎంఆర్పీకి అదనంగా రూ.40 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నడుపుతూ సామాన్య ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారని మండిపడ్డారు. బెల్టుషాపులను నివారించడంలో ఆబ్కారీ శాఖ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని, మండలంలో 18 పంచాయతీల్లో బెల్టుదుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయని, మద్యం షాపుల యజమానులు బెల్టుషాపులకు యధేచ్ఛగా విక్రయాలు చేస్తుండటంతో బడి,గుడి అని తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ బెల్టుదుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బెల్టు దుకాణాల వల్ల గొడవలు కూడా ఎక్కువవుతాయని ఈ బెల్టు దందాపై జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రీవెన్స్లో ఫిర్యాదు చేసిన వారిలో బీజెపి నాయకులు చుక్కపల్లి బాలాజీ, బానోత్ వెంకటేష్, శరత్ బాబు తదితరులు ఉన్నారు.

## గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ రాజమౌళి మృతికి సిపిఎం సంతాపం

- మీ సేవలు మరువ లేము
- గంగదేవిపల్లినీ ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన కూసం రాజమౌళి
- భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన సిపిఎం జిల్లా నాయకత్వం



**సుజాత నగర్ ప్రజాజ్యోతి మార్చ్ 09:** సుజాత నగర్ మండల సిపిఎం నాయకులు ఉమ్మడి వరంగల్ జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు తెలంగాణ లో గంగదేవిపల్లినీ ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన కూసం రాజమౌళి మృతికి సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకత్వం సంతాపం తెలియజేసింది. జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ గంగదేవి పల్లి గ్రామంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, వీర్ల రమేష్ సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు గండమాల భాస్కర రావు సందర్శించి నివాళులర్పించారు. కూసం రాజమౌళి సిపిఎం రాష్ట్ర నాయకులు అమరజీవి కామ్రేడ్ కాసాని ఐలయ్యకు ఉద్యమ సహచరులుగా పార్టీలో పని చేశారని గుర్తు చేశారు.1974లో కాసాని ఐలయ్య గంగదేవిపల్లి గ్రామాన్ని వదిలి ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెం మండలం సుజాతనగర్ ప్రాంతంలోని రెడ్డిపాలెం గ్రామానికి బయలుదేరి వచ్చే క్రమంలో ఓంకార్ నాకు ఒక మనిషిని తయారు చేసి నువ్వు ఖమ్మం జిల్లా వెళ్లాలని చెప్పిన తరుణంలో రాజమౌళిని పూర్తి కాలం కార్యకర్తగా తయారుచేసి ఓంకార్ కి అప్పజెప్పి సుజాతనగర్ ప్రాంతానికి కాసాని వచ్చారనీ తెలిపారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో గంగదేవిపల్లినీ ఆదర్శ పంచాయతీగా స్వచ్ఛ గ్రామంగా మధ్య నిషేధం లేని గ్రామంగా 99 దేశాల ప్రతినిధులు వచ్చే సందర్శించి రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దిన ఆదర్శ ప్రజా ప్రతినిధి అని కొనియాడారు.ఆస్ఫూర్తితోనే సుజాత నగర్ ఉమ్మడి పంచాయతీని ముప్పై ఏడు సంవత్సరాలు సుపరిపాలన అందజేసి రూపాయికే మినరల్ వాటర్ అందించిన స్ఫూర్తి రాజమౌళి ద్వారానే పొందామనీ అన్నారు.రాజమౌళి గంగదేవిపల్లిలో అందించిన ప్రజా పాలన స్ఫూర్తితో సుజాత నగర్ ఇరవై ఒకటవ డివిజన్ అభివృద్ధి చేయడం ద్వారా రాజమౌళికి నివాళిగా అర్పిస్తామని అన్నారు.

## గిరిజన దర్బార్ లో స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

**భద్రాచలం, మార్చి 9,ప్రజాజ్యోతి :** గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించే అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం భద్రాచలం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో యూనిట్ అధికారుల సమక్షంలో వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ గిరిజనులు వివిధ సమస్యలపై సమర్పించిన అర్జీలను పరిశీలించి, ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు గిరిజన దర్బార్ కు వచ్చిన దరఖాస్తుల వివరాలను సంబంధిత యూనిట్ అధికారులు గ్రామాల వారీగా నివేదిక రూపం లో ఐటిడిఏ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు.గిరిజన దర్బార్ లో వచ్చిన అర్జీలను సంబంధిత యూనిట్ అధికారుల ద్వారా సేకరించి గ్రామాల వారీగా ఆన్ లైన్ లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజనుడికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ఈఈ ట్రైబల్ మధుకర్, డిటిఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ వేణు, ఎఫ్ డీసీ ఉదయ్ కుమార్, హెచ్ లింగానాయక్, గురుకుల పర్యవేక్షకుడు నరసింహారావు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షకురాలు ప్రమీలబాయి, మేనేజర్ ఆదినారాయణతో పాటు వివిధ విభాగాల సిబ్బంది మోహన్, భార్గవి పాల్గొన్నారు.



# గిరిజన మ్యూజియాన్ని తిలకించిన జాతీయ పరిపాలనా అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణి

- ఐటీడీఏ సంక్షేమ పథకాలపై విభాగాల వారీగా జాబ్ చార్ట్ రూపొందించాలని సూచన
- ప్రభుత్వ కార్యాలయాల్లో గిరిజన మహిళలు తయారు చేసే మిల్లెట్ ఉత్పత్తుల విక్రయాలకు చర్యలు తీసుకోవాలి







**భద్రాచలం, మార్చి 9,ప్రజాజ్యోతి :** ఆదివాసి గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు ఎంతో రుచిగా ఉన్నాయని, వారికి మరింత ఆదాయం చేకూరాలంటే ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో ఈ ఉత్పత్తుల విక్రయాలు జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలనా అకాడమీ న్యూఢిల్లీ డైరెక్టర్ శ్రీరామ్ తరణి సూచించారు.సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా భద్రాచలంలోని గిరిజన మ్యూజియంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయం ప్రకారం ఐటీడీఏ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మ్యూజియంలో ప్రదర్శనలో ఉంచిన గిరిజనుల కళాఖండాలు, సంప్రదాయ వస్తువులను ఆయన ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా శ్రీరామ్ తరణి మాట్లాడుతూ మ్యూజియంలో ప్రదర్శించిన గిరిజన కళాఖండాలు, సంప్రదాయ వస్తువుల చరిత్రను మరియు వాటి వినియోగ విధానాలను పర్యాటకులకు వివరించి వాటి విక్రయాలు నిర్వహిస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లకు సంబంధించిన అనేక విలువైన వస్తువులను మ్యూజియంలో పొందుపరచడం అభినందనీయమని తెలిపారు.మ్యూజియంలోని ప్రతి గదిని వీడియో రూపంలో చిత్రీకరించి ప్రదర్శిస్తే పర్యాటకులకు గిరిజనుల చరిత్ర సులభంగా అర్థమవుతుందని ఆయన సూచించారు. అలాగే గిరిజన సంక్షేమం కోసం పనిచేస్తున్న ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న విభాగాలు, వాటి ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విభాగాల వారీగా జాబ్ చార్ట్ రూపొందించి తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు.గిరిజనుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఐటీడీఏ తరపున సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్ డైరెక్టర్‌కు జ్ఞాపికను అందజేశారు. గిరిజన మహిళలు తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్లను కూడా ఆయనకు అందించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్, జిల్లా సరఫరా అధికారి ప్రభాకర్‌రావు, లైజన్ అధికారి మహేష్, తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, మేనేజర్ ఆదినారాయణ, మ్యూజియం నిర్వాహకులు వీరాస్వామి, మాధవి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న జాతీయ అకాడమీ ఢిల్లీ డైరెక్టర్ శ్రీరామ్ తరణి దంపతులు

- ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య



**భద్రాచలం, మార్చి 9,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని సోమవారం లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలనా అకాడమీ న్యూఢిల్లీ డైరెక్టర్ శ్రీరామ్ తరణి తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె. దామోదర్‌రావు, అర్చకులు దేవస్థానం సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీ తాయారు అమ్మవారిని, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీరామ్ తరణి దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరపున శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను కార్యనిర్వాహణాధికారి కె. దామోదర్‌రావు అందజేశారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, లైజన్ అధికారి మహేష్, భద్రాచలం తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఇదిలా ఉండగా సోమవారం సందర్భంగా స్వామివారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆలయంలో నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

# వనవాసి పరిషత్ కు బియ్యం వితరణ



**చర్ల, మార్చి 09 (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో సోమవారం తేగడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుప్పా వెంకటేశ్వరరావు మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి మహాలక్ష్మి , కుమార్తె స్రవంతి కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను అందచేసారు. నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడుతూ విద్యార్థి నిలయంకు దాతలు అందచేస్తున్న సహకారం మరువలేనిదని పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు అని అన్నారు .విద్యార్థి నిలయ అధ్యక్షులు తాటి పాపారావు మాట్లాడుతూ సంస్కారంతో కూడిన విద్య ఎంతో అవసరమని దాతల మనోభావాలను అనుగుణంగా విద్యార్థులు చదివి సంస్థ పేరుప్రతిష్టతను నిలపాలన్నారు. స్రవంతి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నదని ఇదే క్రమ శిక్షణను కొనసాగించి జీవితంలో ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ సభ్యులు, విద్యార్థులు స్వర్గీయ వెంకటేశ్వరరావు కు పూలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కొమరం భీం విద్యార్థి నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాం లక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, వనవాసీ జిల్లా సహ సంఘటనా మంత్రి గొంది శోభన్‌బాబు, మమతా రాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మృతుడు కుటుంబానికి యువత చేయూత

- "మనకోసం మనం యూత్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సహాయం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 9,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని బూర్గుగూడెం (రామ్ నగర్) గ్రామంలో యువకులు సమాజ సేవలో ముందడుగు వేస్తున్నారు. గ్రామానికి చెందిన సుమారు 40 మంది యువకులు కలిసి "మనకోసం మనం యూత్ ఫౌండేషన్"ను ఏర్పాటు చేసి అవసరంలో ఉన్నవారికి సహాయం అందిస్తున్నారు.గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాల్ద సుబ్బారావు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న యువకులు వెంటనే స్పందించి సహాయం చేయాలని నిర్ణయించారు. ఫౌండేషన్ సభ్యులు కలిసి రూ.50 వేల ఆర్థిక సహాయం సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.గ్రామంలో ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు తమ వంతు సహాయం అందిస్తామని యువకులు తెలిపారు.యువత చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. మృతుడి కుటుంబ సభ్యులు కూడా మన కోసం మనం యూత్ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# 'మన బయ్యారం' ఇన్‌స్టాగ్రామ్ పేజ్ సేవా కార్యక్రమం





**పినపాక,మార్చి 09(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం ఈ. బయ్యారం స్థానిక యువకులు బయ్యారం ప్రాంత గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రారంభించిన "మన బయ్యారం" ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రస్తుతం పినపాక మండలంలో మంచి ఆదరణ పొందుతోంది. ఈ పేజ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఈ గ్రూపు ద్వారా వచ్చిన నగదుతో సోమవారం జడ్పీఎస్ఎస్ ఈ బయ్యారం, పీఎస్ ఈ బయ్యారం, పీఎస్ గాండ్ల బయ్యారం పాఠశాలల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్లు శ్రీరామ్ నివేదన్, ప్రవీణ్, ప్రకాష్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ గ్రూప్ ద్వారా వచ్చే ఆదాయాన్ని భవిష్యత్తులో పేద విద్యార్థుల చదువుకు ఉపయోగిస్తామని గ్రూప్ అడ్మిన్‌లు తెలిపారు.

# బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు రిలీవ్

- డీఈడీ ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు

**భద్రాచలం,మార్చి 9,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న వీరునాయక్‌ను పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా సోమవారం తన పదవి నుంచి రిలీవ్ చేసి మాతృసంస్థకు పంపినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.ప్రస్తుతం బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతలను తాత్కాలికంగా భద్రాచలం డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ భవానీకి పూర్తి అదనపు బాధ్యతలుగా అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. పరిపాలనా పనులు సజావుగా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.



### భద్రాద్రి జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి

# అనుమానాస్పద మృతి

- వివాహేతర సంబంధం వివాదం నేపథ్యంలో హత్య ఆరోపణలు...
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 9, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కవిత అనే మహిళ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతురాలి కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం, కవిత భర్త నాగేశ్వరరావుకు తన వదినతో వివాహేతర సంబంధం ఉన్నట్లు కొంతకాలంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఈ విషయంపై గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చి, కోపోద్రిక్తుడైన నాగేశ్వరరావు కవితపై దాడి చేసి హత్య చేసినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు వెంటనే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి భర్త నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాతే మృతి కారణాలపై స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ప్రగతిపథంలో ప్రభుత్వం



- ప్రజా పాలనలో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం.... జూపల్లి శశికళ...మున్సిపల్ చైర్ పర్సన్
- 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2కే రన్

**అశ్వారావుపేట, మార్చి 09, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక అనే ఓ బహుత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని , పాలనను ప్రజల గడప వద్దకు తీసుకువెళ్లటమే దీని ముఖ్య ఉద్దేశం అని మున్సిపాలిటీ చైర్ పర్సన్ జూపల్లి శశికళ అన్నారు . సోమవారం 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ జూపల్లి శశికళ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు మున్సిపల్ సిబ్బంది, ప్రజలతో కలిసి ప్రధానరహదారులలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శశికళ మాట్లాడుతూ ఈ 99 రోజుల ప్రణాళిక మన మున్సిపాలిటీ అభివృద్ధికి దిశానిర్దేశం చేయబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలోని ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కోసం కౌన్సిలర్ల సహకారంతో ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తామన్నారు. పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ప్రజారోగ్యం, విద్యా రంగంలో మార్పులు, రైతు సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, పలువురు కౌన్సిలర్లు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ ఫోన్ ల మాయలో సమాజం

- పిల్లల నుంచి పెద్దల వరకు పెరుగుతున్న వినియోగం
- మానసిక ఆరోగ్య సమస్యలకు దారి
- సమయ నియంత్రణ అవసరమంటున్న నిపుణులు




**సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది రోజువారీ అవసరాల కోసం స్మార్ట్ ఫోన్ లపై ఆధారపడుతున్నారు. అయితే వీటి వినియోగం పరిమితి దాటితే మానసిక, శారీరక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

సమాచారాన్ని త్వరగా అందుకోవడం, ఆన్ లైన్ విద్య, బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలు వంటి అనేక అవసరాలకు స్మార్ట్ ఫోన్ లు ఉపయోగపడుతున్నాయి. అయితే వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడపడం వల్ల అనేక మంది తమ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు.

**యువతపై ఎక్కువ ప్రభావం...** ప్రస్తుతం యువతలో స్మార్ట్ ఫోన్ వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. గంటల తరబడి సోషల్ మీడియా, గేమ్స్, వీడియోలతో కాలక్షేపం చేయ డం వల్ల చదువుపై దృష్టి తగ్గుతోంది. దీని కారణంగా విద్యార్థులు చదువులో వెనుకబడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు.

**చిన్నపిల్లల్లో పెరుగుతున్న అలవాటు...** ఇటీవల



చిన్న పిల్లలకు కూడా తల్లిదండ్రులు ఫోన్లు ఇవ్వడం పెరిగింది. పిల్లలు ఏడుస్తున్నప్పుడు లేదా మారం చేస్తున్నప్పుడు వారిని మౌనంగా ఉంచేందుకు ఫోన్ ఇవ్వడం వల్ల చిన్న వయస్సులోనే ఫోన్ కు అలవాటు పడుతున్నారు. దీంతో ఆటలు, స్నేహాలు వంటి సహజ కార్యకలాపాలకు వారు దూరమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఆరోగ్యంపై ప్రభావం....** స్మార్ట్ ఫోన్ ను ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల కళ్లపై ఒత్తిడి, తలనొప్పి, మెడనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. చిన్నపిల్లలు ఎక్కువగా స్క్రీన్ చూడడం వల్ల చూపు సమస్యలు రావచ్చని కూడా సూచిస్తున్నారు. మానసిక ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

**నియంత్రణ అవసరం...** స్మార్ట్ ఫోన్ లను పూర్తిగా దూరం చేయడం సాధ్యం కాకపోయినా వాటి వినియోగాన్ని నియంత్రించుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు ఫోన్ వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ వహిస్తూ చదువు, ఆటలు, కుటుంబంతో సమయం గడపడానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

## ఎర్రగుంట పీహెచ్‌సీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ప్రజా పాలన – 100 రోజుల హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిపుణుల వైద్య పరీక్షలు



**అన్నపురెడ్డిపల్లి, మార్చ్ 9,ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – 100 రోజుల హెల్త్ మిషన్" కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యురాలు డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఈ శిబిరంలో జిల్లా స్థాయి నుండి వివిధ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. స్త్రీరోగాలు, చిన్నపిల్లల వైద్యం, ఎముకల సమస్యలు, కంటి, దంత మరియు జనరల్ మెడిసిన్ నిపుణులు రోగులను పరీక్షించనున్నారు. పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుంది. వైద్య పరీక్షలకు వచ్చే రోగులు తమ వద్ద ఉన్న పాత మెడికల్ రిపోర్టులు లేదా ఫైళ్లను వెంట తీసుకురావాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రియాంక కోరారు.

## ఇసుక సొసైటీ కమిటీని రద్దు పరచాలి

- జిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ



**చర్ల,మార్చ్ 09:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో సోమవారం సుబ్బంపేట పంచాయతీ బిఎస్ రామయ్య నగర్ కాలనీకి సంబంధించిన శ్రీ కొమరం భీం ఆదివాసి మహిళ ఇసుక సొసైటీలో అనేక అక్రమాలకు పాల్పడుతూ ఇద్దరు ముగ్గురు బ్రోకర్లకు అగ్రిమెంటు ఇచ్చి భారీగా సొమ్ము చేసుకున్నారని సొసైటీలో ఉన్న సభ్యత్వం గల సభ్యులకి ఏమాత్రం తెలియజేయకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించకుండా పదిమందితోనే బ్రోకలతో నడిపిస్తూ మిగిలిన సభ్యులకు తీవ్రంగా అన్యాయం చేశారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు ఎలకం రామకృష్ణలు ఆరోపించారు. గతంలో ఈ సొసైటీ పై జిల్లా కలెక్టర్ కి , టీజీఎండిసి పిఓ కి జిల్లా డిసిఓ కి ఫిర్యాదు చేసారని దానిలో భాగంగానే సోమవారం జిల్లా సొసైటీ ఆఫీసు నుండి విచారణకు అధికారులు వచ్చి పూర్తి విచారణ సభ్యత్వం గల సభ్యుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారని అందులో ఇంకా మిగిలిన 27 మంది కొత్త శాండ్విచ్ కల్పించాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది అని అన్నారు .ఈ కార్యక్రమంలో సోడి సురేష్. ,ఆదినారాయణ , రేగ ఆంధ్రయ్య కొత్త సభ్యత్వం గల ఆదివాసులు పాల్గొన్నారు.



- ఒత్తిడికి దూరంగా ఉండి సాధన పెంచుకోవాలి

పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు

**విద్యార్థుల భవిష్యత్ విద్యలో పదో తరగతి కీలక మైలురాయిగా భావిస్తారు. ఈ తరగతిలో సాధించే ఫలితాలే వారి ఉన్నత విద్యకు పునాది వేస్తాయి. త్వరలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై అనవసర ఒత్తిడి చేయకుండా వారికి అనుకూలమైన చదువు వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ప్రణాళికాబద్ధంగా చదివితేనే...

# మెరుగైన ఫలితాలు

### హిందీలో పాఠ్య పుస్తకం పూర్తిగా చదవాలి:

**నాంపల్లి మధుసూదన్ రావు**



హిందీ పరీక్షలో అధిక మార్కులు సాధించాలంటే పాఠ్య పుస్తకాన్ని పూర్తిగా చదవడం అత్యంత అవసరమని దుమ్ముగూడెం మండలం జడ్ పి నర్సాపురం స్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ (హిందీ) గా పనిచేస్తున్న నాంపల్లి మధుసూదన్ రావు తెలిపారు. నమూనా ప్రశ్నపత్రాలను సాధన చేస్తే ప్రశ్నల సరళిపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. సమాధానాలు రాసేటప్పుడు అక్షరదోషాలు లేకుండా, చేతిరాత స్పష్టంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పార్ట్-బిలో సమాధానాలు గుర్తించేటప్పుడు కొట్టివేతలు లేకుండా సరైన ఆప్షన్‌ను ప్రశ్నపత్రంలో ఉన్న అక్షరంతోనే రాయాలని పేర్కొన్నారు. వ్యాకరణ అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

### తెలుగు పరీక్షలో భాషా దోషాలకు తావివ్వొద్దు

**కలం సత్యనారాయణ**



తెలుగు పరీక్షలో మంచి మార్కులు సాధించాలంటే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో పాటు పదజాలంపై పట్టు పెంచుకోవాలని తెలుగు స్కూల్ అసిస్టెంట్ కలం సత్యనారాయణ (జడ్ పి కొర్రాజులగుట్ట ) తెలిపారు. సమాధానాలు రాసేటప్పుడు భాషా దోషాలు, అక్షర దోషాలు లేకుండా రాయాలని చెప్పారు. చేతిరాత అందంగా ఉండేలా చూసుకోవాలని, ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకుని సరైన సమాధానం రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పద్యాలు, గద్య భాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ముఖ్యాంశాలను గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

### గణితంలో సాధన కీలకం:

**బోడ నాగేశ్వరరావు**



గణితంలో మంచి మార్కులు సాధించాలంటే ప్రతి అధ్యాయంలోని సూత్రాలను అర్థం చేసుకుని సమస్యలను ఎక్కువగా సాధన చేయాలని దమ్మపేట మండలంలోని పర్కాలగండి హై స్కూల్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు బోడ నాగేశ్వరరావు తెలిపారు. రేఖీయ సమీకరణాలు, వర్గ సమీకరణాలు, త్రికోణమితి, శ్రేణులు, బహుపదాలు, గ్రాఫ్‌లు వంటి అంశాలను పద్ధతిగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. గ్రాఫ్ లెక్కలలో స్కేలు తప్పకుండా రాయాలని, నిర్మాణ సమస్యలకు ముందుగా చిత్తు పటం గీయాలని చెప్పారు. పైథాగరస్ సిద్ధాంతం, త్రిభుజ నిర్మాణాలు, సమితులు వంటి అంశాలపై కూడా సాధన చేయాలని సూచించారు.

### సైన్స్‌లో అవగాహన పెంచుకోవాలి:

**యం సుధాకర్**



భౌతిక, రసాయన శాస్త్రాలలో పాఠ్యాంశాలను నిత్యజీవితంతో అనుసంధానం చేసుకుంటూ చదవాలని పాల్వంచ మండల పరిధిలోని నాగారం జడ్ పి స్కూల్ భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు యం సుధాకర్ తెలిపారు. కాంతి ప్రతిఫలనం, దర్పణాలు, కటకాలు, పీహెచ్ విలువ, ఎలక్ట్రిక్ మోటార్, విద్యుత్ అయస్కాంతత్వం వంటి అంశాలను బాగా చదవాలని సూచించారు. ప్రయోగ విధానాలు, చిత్రాలు గీయడం, పట్టికలు గుర్తుంచుకోవడం అవసరమన్నారు. ఆధునిక ఆవర్తన పట్టిక, క్వాంటం సంఖ్యలు, కర్బన సమ్మేళనాల నామకరణం వంటి అంశాలను కూడా విద్యార్థులు తప్పక చదవాలని పేర్కొన్నారు.

### జీవశాస్త్రంలో చిత్రాలు, పట్టికలు ముఖ్యము: వి వి కోటేశ్వరరావు



జీవశాస్త్రంలో చిత్రాలు, పట్టికలు, నిర్వచనాలు స్పష్టంగా గుర్తుంచుకోవాలని మణుగూరు మండలపరిధిలోని జడ్ పి రామానుజవరం స్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వి వి కోటేశ్వరరావు తెలిపారు. ప్రతి పాఠంలో ఉన్న చిత్రాలను గీయడం సాధన చేయాలని సూచించారు. ప్రయోగ విధానాలు, పరికల్పనలు, భాగాలను గుర్తించడం వంటి అంశాలను బాగా చదవాలని చెప్పారు. పట్టికల విశ్లేషణ, పోలికలు, భేదాలు వంటి ప్రశ్నలకు సమాధానాలు రాయడం సాధన చేస్తే ఎక్కువ మార్కులు సాధించవచ్చని తెలిపారు.


### ఆంగ్లంలో వ్యాకరణంపై పట్టు అవసరం : యం. రాజా



ఆంగ్ల పరీక్షలో అక్షర దోషాలు ఎక్కువగా ఉంటే మార్కులు తగ్గే అవకాశం ఉందని ఇల్లందు మండల పరిధిలోని జడ్ పి కొమరారం స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్లం) మం రాజా తెలిపారు. సారాంశం రాయడం, డిస్కోర్సులు, వ్యాసరచన, లేఖా రచన వంటి అంశాలను సాధన చేయాలని సూచించారు. విరామ చిహ్నాల వినియోగం, వ్యాకరణం, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, యాక్టివ్-పాసివ్ వాయిస్ వంటి అంశాలపై పట్టు పెంచుకోవాలని చెప్పారు. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్నల సరళి అర్థమవుతుందని పేర్కొన్నారు.

### సాంఘికశాస్త్రంలో అవగాహన కీలకం:

**వి స్వామి**



సాంఘిక శాస త్రంలో ఎక్కువ మార్కులు సాధించాలంటే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఉండాలని జడ్ పి హెచ్ యస్ హేమ చ ంద్రపుర ం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వి స్వామి తెలిపారు. భారతదేశం, ప్రపంచ పటాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మ్యాప్ డ్రాయింగ్, డేటా విశ్లేషణ, నినాదాలు, కరపత్రాల తయారీ వంటి అంశాలను సాధన చేయాలని చెప్పారు. ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకుని కారణాలు, తేడాలు, వివరణలు స్పష్టంగా రాయడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని పేర్కొన్నారు.

పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని, రోజువారీ చదువుకు ప్రణాళిక రూపొందించుకుని దాని ప్రకారం సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచించారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలకు మానసికంగా ధైర్యం చెప్పి ప్రోత్సహిస్తే వారు మరింత ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయగలరని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాలలో విద్యార్థుల పారిశుద్ధ్య కార్యక్రమం




భద్రాచలం, మార్చి 9,(ప్రజాజ్యోతి :భద్రాచలంలోని ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ సేవా పథకం విద్యార్థులు కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిధిలోని వివిధ విభాగాలు, తరగతి గదులు, ప్రాంగణం మరియు ఇతర ప్రదేశాలను విద్యార్థులు శుభ్రం చేశారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన జాతిపిత మహాత్మా గాంధీ స్వచ్ఛతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని గుర్తుచేశారు. ఆయన తన సౌచాలయాన్ని తానే శుభ్రం చేసుకునే అలవాటు కలిగి ఉండేవారని తెలిపారు. అదే స్ఫూర్తితో మనకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న కళాశాల పరిసరాలను కూడా ప్రతిరోజూ శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. తరగతి గదులు, సౌచాలయాలు మరియు కళాశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటే అనేక వ్యాధులు దూరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నోడల్ అధికారి డాక్టర్ శ్రీను, జాతీయ సేవా పథకం కార్యక్రమాధికారులు కిరణ్ కుమార్, సుధాకర్ రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ కార్యాలయంలో పారిశుద్ధ్య చర్యలు ఫైళ్ల క్రమబద్ధీకరణ



భద్రాచలం, మార్చి 9,(ప్రజాజ్యోతి :ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించినట్లు ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు తెలిపారు.ఈ సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆధ్వర్యంలో రికార్డు గదులను శుభ్రపరిచి, ఫైళ్లను క్రమబద్ధంగా అమర్చారు పనికిరాని పాత ఫైళ్లను తొలగించి అవసరమైన రికార్డులను సక్రమంగా వర్గీకరించి భద్రపరిచారు. కార్యాలయ నిర్వహణ సులభంగా ఉండేలా రికార్డులను సవ్యంగా అమర్చినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి పవర్ వేణు, మేనేజర్ ఆదినారాయణ, శ్రీనివాస్, సిబ్బంది సాయి చంద్, సూపల్, లక్ష్మయ్య, అనిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## 5 కె రన్ నిర్వహణ



ఇల్లందు, మార్చి 9, (ప్రజాజ్యోతి:ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన కార్యక్రమాలలో భాగంగా సోమవారం 5కె రన్ ను మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ద్వారా ఇల్లందు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డులలో మున్సిపల్ సిబ్బందిచే శానిటేషన్, డ్రైనేజ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుండి జగదాంబ సెంటర్ వరకు 5కె రన్ ను ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్, మేనేజర్ అంకుషావలి, డిఈ మురళి, ఆర్ఐ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్, ఏఈ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 9 ప్రజాజ్యోతి:ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనలతో కలిసి కలెక్టర్ ప్రజల వినతులను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

అశ్వాపురం మండలం వేములూరు గ్రామానికి చెందిన కొమరం నాగమణి తనకు ఇంటి స్థలం ఉన్నప్పటికీ ఇల్లు లేదని, ఇటీవల జరిగిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తనకు ఇల్లు ఉన్నట్లు చూపించారని పేర్కొన్నారు. కావున తన పరిస్థితిని పరిగణలోకి తీసుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఇల్లందు మండలం రొంపేడు గ్రామానికి చెందిన సుశీల తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి లబ్ధి అందలేదని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించగా నాట్ అప్లైడ్ గా చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం ఇల్లందు ఎంపీడీవోకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన మాదాబత్తుల రమణ ఇంటర్ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసి 77 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నానని, కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. జీవనోపాధి కోసం దివ్యాంగుల స్కూటీ మంజూరు చేయాలని కోరగా, దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.పాల్వంచకు చెందిన కోలా శ్రీను తన కుమారుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అవుట్సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ ఫిబ్రవరి 13న న అనారోగ్యంతో మరణించాడని తెలిపారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులుగా కుటుంబ పోషణ భారంగా మారిందని, తన కుమారుడికి సంబంధించిన బకాయి వేతనాలు తమకు అందించడంతో పాటు తమపై ఆధారపడిన కుమార్తెకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిపై తగు చర్యల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి కలెక్టర్ ఎండార్స్ చేశారు. బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన బిటియా ఏసు తన తండ్రి అనారోగ్య కారణాలతో 2021లో మరణించారని,ఆ సమయంలో మరణ ధ్రువీకరణ పత్రం పొందలేకపోయామని తెలిపారు. ఇటీవల మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ సమస్య ఎదురవుతోందని పేర్కొన్నారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం భద్రాచలం సబ్ కలెక్టర్కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

● 87వ దినోత్సవం సందర్భంగా జవాన్ల సేవాభావం




భద్రాచలం, మార్చి 9,(ప్రజాజ్యోతి :భద్రాచలంలో సోమవారం కేంద్ర రిజర్వు పోలీసు దళం 141వ బెటాలియన్ ఆధ్వర్యంలో 87వ సీఆర్పీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ అధికారులు మరియు జవాన్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్యులు మరియు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రక్తసేకరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన రోగులకు ఉపయోగపడేలా భద్రపరచనున్నట్లు వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ సమాజం పట్ల తమకున్న బాధ్యతను, సేవాభావాన్ని చాటుకునేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యువత కూడా రక్తదానం చేయడంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం సీఆర్పీఎఫ్ సిబ్బంది దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు మానవతా దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని అధికారులు తెలిపారు. ఈ శిబిరంలో పలువురు అధికారులు, జవాన్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

పాల్వంచ, మార్చి 9, (ప్రజాజ్యోతి:కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ) ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం పాల్వంచలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ముందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ టీచర్లు, పీజీ కాంట్రాక్ట్ టీచర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయుల అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 29 రోజుల సమ్మెకాలానికి సంబంధించిన జీతాలు ఇప్పటికీ చెల్లించలేదని తెలిపారు. ఉద్యోగ భద్రత లేకుండా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కేజీబీవీల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లను ప్రిన్సిపల్స్గా, సీఆర్టీలు మరియు పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా, పీజీసీఆర్టీలను జూనియర్ లెక్చరర్లుగా గుర్తించి వారికి కనీస ప్రాథమిక వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేసి రాత్రి బస బాధ్యతల నుంచి మినహాయించి, ఆ స్థానాల్లో ప్రత్యేకంగా కేర్ టేకర్లను నియమించాలని కోరారు. అదేవిధంగా కేజీబీవీ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే. యాకూబ్ పాషా, పాల్వంచ మండల అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి హరి సింగ్, సోషల్ మీడియా సభ్యుడు బి. మంగిలాల్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ తులసి, మాధవి, రేణుక, హీరామణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి జామాయిల్ నరికివేత

- ప్రేక్షక పాత్ర వహిస్తున్న కేఓసీ యాజమాన్యం
- లక్షల్లో సింగరేణికి నష్టం..!



**టేకులపల్లి, మార్చి09, ప్రజాజ్యోతి:** కోయగూడెం ఓసి అధికారుల నిర్లక్ష్యం సింగరేణి యాజమాన్యంకి నష్టం తెచ్చి పెడుతుంది. సుమారు 15 ఏళ్ల క్రితం సింగరేణి ఓబి గుట్టలపై జామాయిల్ మొక్కలను నాటించడం జరిగింది. ప్రస్తుతం జామాయిల్ మొక్కలు ఏపుగా పెరిగి కోత దశకు చేరుకున్నాయి. దీంతో అక్రమార్కుల కన్ను జామ్ ఆయిల్ మొక్కలపై పడింది. ఓబి గుట్టల చుట్టూ రక్షణ లేకపోవడంతో కలప అక్రమార్కులు రాత్రికి రాత్రే జామాయిల్ చెట్లను నరికి వేస్తున్నారు. గత నెల రోజులుగా ఈ వ్యవహారం జోరుగా సాగుతున్నప్పటికీ కెఓసి యాజమాన్యం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తుంది.

**రాత్రికి రాత్రే నరికివేత..**

జామాయిల్ నాటి 15 ఏళ్లు కావస్తుంది. దీంతో ఒక్కో చెట్టు టన్ను వరకు బరువు వస్తుంది. ఓబి గుట్టలపై ఉన్న జామాయిల్ ను గుర్తించిన కలప అక్రమార్కులు రాత్రికి రాత్రే మిషన్ల ద్వారా జామాయిల్ మొక్కలను చెట్లు నరుకుతున్నారు. వెంటనే ట్రాక్టర్లను లోడ్ చేసి రహస్యంగా సమీప డిపోలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**అక్రమార్కులకు వరం..**

పది చెట్ల నరికితే ట్రాక్టర్ లోడ్ అవుతుండడంతో అక్రమార్కులకు ఈ వ్యవహారం వరంగా మారింది. ఒక ట్రాక్టర్ విక్రయం ద్వారా సుమారు లక్ష నుంచి లక్షన్నర వరకు వస్తుండడంతో పాటుగా అడ్డు చెప్పేవారు ఎవరూ లేకపోవడంతో ఈ దందా యదేచ్ఛగా కొనసాగుతుంది.

**కె ఓ సి అధికారుల నిర్లక్ష్యం..**

చేతికొచ్చిన ఫలసాయాన్ని కాపాడుకొని సంస్థకు లాభాలు తెచ్చి పెట్టాల్సిన సింగరేణి అధికారులు అటువైపుగా ఆలోచించడం లేదు. కళ్ళెదుట జరుగుతున్న అక్రమాన్ని కూడా పట్టించుకోవడం లేదనే పలు విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చిన ఫల సాయాన్ని అటవీ శాఖకు అప్పగించిన ఆ విధంగానైనా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరేది. కానీ కే ఓ సి అధికారులు నిర్వాకం సింగరేణి యాజమాన్యానికి లక్షల్లో నష్టం తెచ్చిపెడుతుందనడం లో ఎటువంటి సందేహం లేదు అని పలు విమర్శిస్తున్నారు.

## వలలో చిక్కి కొండ చిలువ మృతి



**టేకులపల్లి,మార్చి09,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం రోళ్ళపాడు గ్రామంలోని రోళ్ళపాడు చెరువులో చేపలు తినేందుకువచ్చి వలలో చిక్కిన కొండ చిలువ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.రోళ్లపాడు గ్రామానికి చెందిన చీమల నరేష్ చేపలు పట్టేందుకు చెరువులో ఆదివారం వల వేశా డు. సోమవారం ఉదయం వల తీసేందుకు వచ్చి చూడగా అందులో కొండ చిలువ చిక్కి చనిపోయి ఉంది. కొండచిలువ 60 కేజీల బరువు, 12 అడుగులు పొడవు ఉందని మత్స్యకారుడు తెలిపాడు.

## గౌరీదేవిపేట ప్రభుత్వ పాఠశాలకు లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం

- విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు పలు వస్తువుల పంపిణీ

**భద్రాచలం,మార్చి 9,ప్రజాజ్యోతి :** గౌరీదేవిపేట గ్రామ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల అవసరాలను గుర్తించి విద్యార్థుల విద్యాభ్యాసానికి మరియు పాఠశాల వసతుల మెరుగుదలకు అవసరమైన పలు వస్తువులను క్లబ్ ప్రతినిధులు అందజేశారు.ఈ సందర్భంగా తరగతి గదుల్లో బోధన సౌలభ్యం కోసం బ్లాక్ బోర్డులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది వినియోగానికి కుర్చీలు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు డస్ట్ బిన్లు, ఎండ నుండి రక్షణ కోసం షెడ్ క్లాత్, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కూలింగ్ క్యాన్లను పాఠశాలకు అందించారు.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ భద్రాచలం అధ్యక్షురాలు కమల రాజశేఖర్ అధ్యక్షత వహించారు. క్లబ్ కార్యదర్శి సిద్ధారెడ్డి, కోశాధికారి యడ్లపల్లి రామారావు, ప్రతినిధులు ఉమాశంకర్ నాయుడు, పవన్ గుడికందుల పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి కోశాధికారి యడ్లపల్లి రామారావు మాతృమూర్తి గంగాలక్ష్మి సహకారం అందించారు.గౌరవ అతిథులుగా వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, గౌరీదేవిపేట సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమల రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి దోహదపడటమే క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న లయన్స్ క్లబ్ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు గ్రామ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.




## కేజీబీవీ, యు ఆర్ ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై మూడు దశల పోరాటం

- టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్.



**టేకులపల్లి,మార్చి09,ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండల కస్తూర్బా గాంధీ బాలిక టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేజీబీవీ, యు ఆర్ ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై మూడు దశల పోరాటం సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో,గురుకులాల్లో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బంది సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో దశల వారీ పోరాటం చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించారు అని ఆయన తెలిపారు. కేజీబీవీ యుఆర్ఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి.రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా వేతనాలు అరకొరగానే ఉన్నాయి అని ఆయన ఆరోపించారు.గతంలో చేసిన అనేక పోరాటాల సందర్భంలో సర్వీస్ కండిషన్లకు సంబంధించి అధికారులు ఇచ్చిన హామీలు, అమలు జరపకపోగా గతంలో 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉపముఖ్యమంత్రితో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన అంశాలు కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా పోరాడితే కక్షగట్టి ఇబ్బందులకు గురి చేయడం తగదని ఆయన అన్నారు.ప్రభుత్వం స్పందించి వారి శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ ఆయన చేశారు.ఎస్ఓలను ప్రిన్సిపల్స్ గా,పిజిసి ఆర్టిలను జే ఎల్ గా,సిఆర్టి,పిఈటి, సీఆర్పీలను ఎస్ఏలుగా పరిగణించి కనీస మూల వేతనాన్ని చెల్లించాలని ఆరోగ్య భద్రత కల్పించడం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని,కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలా డ్యూటీల నుండి విముక్తి చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్ సింగ్ మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి మూడు దశల పోరాటంలో భాగంగా ఈ నెల 9న సోమవారం పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు ఈ నెల 16వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు అప్పటికి ప్రభుత్వ స్పందించకపోతే మార్చి 20 శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతున్న సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహిస్తామని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్ సింగ్ తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోపే సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డ్ లో కనీస వేతనాలకు సరిపడా నిధులకు ప్రతిపాదనలు పంపించాలని కోరుతున్నాం.లేనిచో సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు హరికుమార్, ఉపాధ్యక్షులు మాన్సింగ్ ,కేజీబీవీ ఎస్ ఓ సంతు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇసుక సొసైటీ కమిటీని రద్దు పరచాలి

- జిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ



**చర్ల,మార్చ్ 09: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో సోమవారం సుబ్బంపేట పంచాయతీ బిఎస్ రామయ్య నగర్ కాలనీకి సంబంధించిన శ్రీ కొమరం భీం ఆదివాసి మహిళ ఇసుక సొసైటీలో అనేక అక్రమాలకు పాల్పడుతూ ఇద్దరు ముగ్గురు బ్రోకర్లకు అగ్రిమెంటు ఇచ్చి భారీగా సొమ్ము చేసుకున్నారని సొసైటీలో ఉన్న సభ్యత్వం గల సభ్యులకి ఏమాత్రం తెలియజేయకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించకుండా పదిమందితోనే బ్రోకలతో నడిపిస్తూ మిగిలిన సభ్యులకు తీవ్రంగా అన్యాయం చేశారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు ఎలకం రామకృష్ణలు ఆరోపించారు. గతంలో ఈ సొసైటీ పై జిల్లా కలెక్టర్ కి , టీజీఎం డిసి పిఓ కి జిల్లా డిసిఓ కి ఫిర్యాదు చేసారని దానిలో భాగంగానే సోమవారం జిల్లా సొసైటీ ఆఫీసు నుండి విచారణకు అధికారులు వచ్చి పూర్తి విచారణ సభ్యత్వం గల సభ్యుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారని అందులో ఇంకా మిగిలిన 27 మంది కొత్త శాండ్విచ్ కల్పించాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది అని అన్నారు .ఈ కార్యక్రమంలో సోడి సురేష్. ,ఆదినారాయణ , రేగ ఆంధ్రయ్య కొత్త సభ్యత్వం గల ఆదివాసులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న భద్రాద్రి యువ టి–10 మెగా ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్



**భద్రాచలం, మార్చి 9,ప్రజాజ్యోతి :** భద్రాచలం సమీపంలోని మేడువాయి గ్రామంలో ఉన్న డాక్టర్ పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న భద్రాద్రి యువ టి–10 మెగా ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్ రెండవ రోజు కూడా ఉత్సాహంగా కొనసాగింది. యువ క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరు ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.రెండవ రోజు జరిగిన మొదటి మ్యాచ్‌లో చిన్ని–11 మరియు రాయల్ సిక్సర్స్–11 జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో నాలుగు వికెట్లు సాధించి చిన్ని–11 జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రకాష్‌కు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మారావు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని అందజేశారు.రెండవ మ్యాచ్‌లో ప్రదీప్–11 మరియు ముజ్జు–11 జట్లు పోటీ పడ్డాయి. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్‌తో రెండు వికెట్లు సాధించి ముజ్జు–11 జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన లోకేష్‌కు మణుగూరులోని మా హైపర్ మార్ట్ యజమాని కోటిపల్లి రాజేష్, భద్రాచలంలోని కేఎన్ఆర్ మార్ట్ యజమాని చంద్రశేఖర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని అందజేశారు.రెండవ రోజు మూడవ మ్యాచ్‌లో ఆచార్య–11 మరియు ఆర్వీ–11 జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్‌తో రెండు వికెట్లు సాధించి ఆర్వీ–11 జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన అజయ్‌కు పట్టణ కాంగ్రెస్ నాయకులు ఉబ్బా వేణు, భద్రాచలం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కణితి సమ్మయ్య మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని అందజేశారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కుంజా సంతోష్, పందా అమృతరావు (అంబు), తాళ్ల నాగరాజు, తాళ్ల రమేష్, శీలం నాగరాజు, బోళ్ల కృష్ణ, నాగార్జున, గోపి, సుమన్, భార్గవ్, శ్యామ్, మున్నాభాయ్, రోహిత్ పాషా, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.